సాక్షి
బాపట్ల
శనివారం । 15 । మార్చి । 2025



వైభవంగా బ్రహ్మోత్సవాలు

భట్టిప్రోలు : పెదపులివర్రులోని శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం నిర్వహించారు.



ముగిసిన బ్రహ్మోత్సవాలు

తెనాలి: బాలాజీరావుపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సాయంత్రం పెద్ద రథం ఊరేగింపు జరిగింది.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



దాచేపల్లి : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ మాశెట్టి బుజ్జి, సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
బాపట్ల	6.23	4.59
నరసరావుపేట	6.25	5.01
గుంటూరు	6.23	4.59

న్యూస్‌రీల్

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

చీరాల: వివాహేతర సంబంధం పెట్టుకుని ఘర్షణకు దిగిన కానిస్టేబుల్‌పై వివాహితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చీరాల డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ కొంతకాలంగా పేరాలకు చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. వివాహిత బంధువులు ఈ విషయాన్ని ప్రశ్నించి ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

16 నెలల్లో నిడమర్రు రైల్వే గేటుపై వంతెన నిర్మాణం పూర్తి

రాష్ట్ర మంత్రి నారా లోకేష్



మంగళగిరి: మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం యర్రబాలెంలో ఆధునికీకరించిన శ్రీ భగవాన్ మహవీర్ గోశాలను, కొత్త భవన సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ నిడమర్రు రైల్వే గేటు వంతెన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, త్వరలోనే టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి 16 నెలల్లోపు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజీ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు మరో రెండు వారాలలో పరిహారం అందజేస్తామన్నారు. మాజీ జెడ్పీటీసీ ఆకుల జయసత్య, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, ఆకుల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

గుంటూరు డీఈఓ సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు శనివారం నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు విద్యార్థులకు ఒక్కపూట తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. టెన్త్ పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా, గ్రామ పంచాయతీ, వైద్యారోగ్య శాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పాఠశాలల్లో అందుబాటు ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాలు, చెట్ల కింద తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

విజయకీలాద్రిపై ఫాల్గుణ పౌర్ణమి వేడుక

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో ఫాల్గుణ మాసం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు లక్ష్మి అమ్మవారికి అభిషేకం, అనంతరం 9.30 గంటలకు లక్ష్మి హయగ్రీవ హోమం వైభవంగా నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు.

అన్నింటా మోసం

అవగాహనతోనే అక్రమాలకు అడ్డుకట్ట

- తూకాల్లో విరివిగా మోసాలు
- వినియోగదారులు ఆదమరిస్తే భారీనష్టం
- చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం
- నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

విజయం ఇలా...

బాపట్లకు చెందిన బ్యాంక్ ఉద్యోగి భావన్నారాయణ నాలుగేళ్ల కిందట తన ఇంటి దస్తావేజులను గుంటూరు ఐసీఐసీఐ బ్యాంక్‌లో తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. అప్పు మొత్తం చెల్లించినప్పటికీ బ్యాంక్ అధికారులు దస్తావేజులు తిరిగి ఇవ్వలేదు. ఇదేమని అడిగితే దస్తావేజులు పోయాయని చెప్పారు. దీంతో రెండేళ్ల కిందట భావన్నారాయణ గుంటూరులోని కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించాడు. బాధితుడి వాదనలు విన్న కోర్టు బ్యాంక్ అధికారులకు రూ.లక్ష జరిమానా విధించి, ఆ సొమ్మును బాధితుడికి అందజేయాలని తీర్పు ఇచ్చింది. బ్యాంక్ అధికారులు రూ.లక్ష నగదు అందజేశారు.



బాపట్ల పట్టణానికి చెందిన సరస్వతి మార్కెట్‌కు వెళ్లింది. అక్కడ పలు వస్తువులు కొనుగోలు చేసి ఇంటికి వచ్చింది. కందిపప్పు ప్యాకెట్ తూకం సక్రమంగా లేనట్లు గుర్తించింది. మళ్లీ మార్కెట్‌కు వెళితే.. దుకాణదారుడు ఆమెనే ఎదురు ప్రశ్నించాడు. దీంతో గొడవెందుకు అనుకుని ఇంటికి వచ్చింది. ఇది ఒక్క సరస్వతి సమస్యే కాదు.. ప్రతి వస్తువూ కొనుగోలు చేసే వినియోగదారుడిది! కొనుగోలు చేస్తున్న వస్తువు క్వాలిటీతోపాటు క్వాంటిటీ ఉందా లేదా అనే అంశాలను గుర్తించడంతో వినియోగదారుల అలసత్వమే దీనికి ప్రధాన కారణం. కేజీ సరుకు కొనుగోలు చేస్తే అందులో 50 గ్రాములు తగ్గినంత మాత్రాన ఏమి అడుగుతాములే! అనే ధోరణిలో ఉన్నారు. కానీ ఇలాంటి వారందరి చేతిలో బ్రహ్మాస్త్రంగా వినియోగదారుల ఫోరం పనిచేస్తోంది. ఇది కొనుగోలుదారుల గొంతుకై వ్యాపారుల మోసాలను నిలదీస్తుంది. వినియోగదారులకు అండగా ఉంటుంది. శుక్రవారం కొన్ని దుకాణాల వద్దకు సాక్షి పరిశీలనకు వెళ్లగా.. అక్కడ తూకాల్లో జరుగుతున్న మోసాలు వెలుగు చూశాయి.

బాపట్లటౌన్: రోజురోజుకు పెరుగుతున్న ధరలు... కల్తీ సరుకులు...తూకల్లోనూ మోసాలు... ఇదీ ప్రస్తుత పరిస్థితి. వీటి నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలి. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా 1962 మార్చి 15న అమెరికా సెనేట్ వినియోగదారులకు నాలుగు హక్కులను ప్రసాదించింది. 1973 మార్చి 15 నుంచి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మన దేశంలో 1986 డిసెంబర్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. ఆ రోజునే జాతీయ వినియోగదారుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

వినియోగదారుల హక్కులు ఇలా..

నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు పొందడంతోపాటు వినియోగదారుల ప్రయోజనాన్ని కాపాడేందుకు చట్టరీత్యా వినియోగదారులకు కొన్ని హక్కులు కల్పించారు. ఈ హక్కులను ఉపయోగించి అమ్మకందారులు ఏవైనా నాసిరకం వస్తువులను అమ్మిన సందర్భాల్లో సరైన ఫోరమ్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. మోసపూరితమైన వ్యాపారుల వలన నష్టపోతే పరిహారం కోరవచ్చు. వస్తువులపై పూర్తిస్థాయిలో అవగాహన పొందవచ్చు. సేవల్లో ఏవైనా లోపాలు జరిగితే బ్యాంకింగ్, వైద్యరంగం, విద్యుత్, రవాణా, బీమా తదితర సంస్థలపై కేసులు కూడా వేసే వెసులుబాటు వినియోగదారులకు ఉంటుంది.

హెల్ప్‌లైన్ సేవలు ఇలా ..

వస్తువుల కొనుగోలు, సేవల విషయంలో మోసం, ఆంక్షలపై వినియోగదారుల కమిషన్లను ఆశ్రయించవచ్చు. చాలా మందికి వీటిపై సరైన అవగాహన లేకపోవడంతో నష్టపోతున్నారు. ఒకవేళ అవగాహన ఉన్నప్పటికీ కోర్టుల చుట్టూ ఏం తిరుగుతాం, తీర్పు ఎప్పటికి వస్తుందోనన్న నిరాశతో చాలామంది వినియోగదారులు మిన్నకుండిపోతున్నారు. జాతీయ వినియోగదారు హెల్ప్‌లైన్ నంబర్ (1916) ఒకటి ఉందని ఇప్పటికీ చాలా మందికి తెలియదు. వినియోగదారులకు మేలైన ప్రయోజనాలు కల్పించేందుకు 1986లోనే చట్టాన్ని ఏర్పాటు చేశారు. ఈ చట్టాన్ని 1993, 2002, 2019లో పలు విధాలుగా సవరించారు.అప్పటినుంచి కేంద్రం నుంచి జిల్లా స్థాయి వరకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్లు పనిచేస్తున్నాయి. అక్రమ వ్యాపారలావాదేవీల విధానాల విషయంలో కొనుగోలుదారులకు ఈ చట్టం భద్రత కల్పిస్తుంది. ఫిర్యాదు చేసిన 30 రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఈ చట్టం సూచిస్తోంది.



ఓ దుకాణంలో నూనె శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు(ఫైల్)

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

బాపట్ల జిల్లాగా రూపాంతరం చెందిన తర్వాత విచ్చలవిడిగా వెలుస్తున్న దుకాణాలు, మాల్స్, సూపర్ మార్కెట్, కిరాణా దుకాణాల యజమానులు తూనికలు, కొలతల్లో భారీగా వ్యత్యాసాలు ఉన్నప్పటికీ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తున్నారే కానీ వాటిని పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయటంలో విఫలమవుతున్నారు. వ్యాపారస్తులు ప్యాకింగ్ లైసెన్స్‌లు పొందకుండానే ఇష్టమొచ్చిన రీతిలో ప్యాకింగ్ చేసి వస్తువులను విక్రయిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వ్యాపారస్తులు మోసాలకు పాల్పడుతున్నారని వినియోగదారులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.



అరిగిపోయిన రాళ్లతో చేపల తూకం



అరిగిపోయిన కాటా రాళ్లు వినియోగం

అధికారులు చర్యలు తీసుకోవాలి



ప్రతి వస్తువులో కల్తీలు జరుగుతున్నాయి. తూకాల్లోనూ మోసాలు జరుగుతున్నాయి. మోసపోయామని తిరిగి వెళ్లినప్పటికీ యజమానులు సరైన సమాధానం చెప్పడం లేదు. అధికారులు స్పందించి వ్యాపార సముదాయాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలి. తూకాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టాలి. కాలం చెల్లిన వస్తువులను కూడా విరివిగా విక్రయిస్తున్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని నివారించాలి.

–షేక్ రబ్బానీ, వినియోగదారుడు

రశీదుతోనే న్యాయం



వినియోగదారులు ఏ వస్తువులు కొనుగోలు చేసినా తప్పనిసరిగా రశీదు పొందాలి. వ్యాపారస్తులు, వ్యాపార సముదాయాలపై ఫిర్యాదు చేయాలంటే రుజువు తప్పనిసరిగా అవసరం అవుతుందనే విషయాన్ని వినియోగదారులు గ్రహించాలి. వస్తువులను కొనుగోలుచేసే సమయంలో నికర తూకం, వస్తువు నాణ్యతా ప్రమాణాలు చూసుకొని కొనుగోలు చేయాలి. అనుచిత వ్యాపార పద్ధతులను అవలంబించరాదు. వినియోగదారుల హక్కులతోపాటు బాధ్యతలను గుర్తించుకోవాలి. సరైన ఆధారాలతో ఫిర్యాదుచేస్తే కేసు 90 రోజుల్లోనే పరిష్కారం అవుతుంది.

–డాక్టర్ పీసీ సాయిబాబు, జిల్లా వినియోగదారుల పరిరక్షణ మండలి సభ్యులు

మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

వ్యాపారస్తులు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం . జిల్లా వ్యాప్తంగా అన్నిరకాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన దుకాణాలను సీజ్ చేయటంతోపాటు అపరాధ రుసుం విధిస్తున్నాం. ఎవరైనా వినియోగదారుడు నష్టపోతే తమకు ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటాం.

-రామదాసు, తూనికల కొలతల అధికారి, బాపట్ల

నృసింహునికి బ్రహ్మరథం

మంగళాద్రిపై కొలువుదీరిన ఉగ్ర నారసింహుడు ఆనంద గర్జన చేస్తూ రథారూఢుడైనట్టు.. చెంతనున్న కృష్ణమ్మ జన ప్రవాహమై పురవీధుల్లో పోటెత్తినట్టు.. అష్టదిక్పాలకుల జయజయధ్వానాలతో దక్షిణాభిముఖంగా కదిలినట్టు.. మంగళగిరి నగరం ఆధ్యాత్మికోత్సాహంలో ఓలలాడింది. లక్ష్మీ నరసింహుని రథోత్సవానికి బ్రహ్మరథం పట్టింది.

- నమో నారసింహా
- మంగళాద్రి.. 'జన'దాద్రి
- అంగరంగ వైభవంగా నృసింహుని దివ్యరథోత్సవం



రథోత్సవానికి స్వామి, అమ్మవార్లను తోడ్కొని వస్తున్న అర్చకులు



'హరి'విల్లై మెరిసే : విద్యుత్ దీప కాంతుల్లో మెరిసిపోతున్న స్వామి రథం, ఆలయ గోపురం

మంగళగిరి/మంగళగిరి టౌన్: జై నారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మంగళగిరి శుక్రవారం మార్మోగింది. శ్రీ లక్ష్మీనరసింహుని దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనంతో పురవీధులు కిటకిటలాడాయి. స్వామి బ్రహ్మోత్సవాలు 11 రోజులుగా అత్యంత వైభవంగా సాగుతున్నాయి. గురువారం రాత్రి స్వామి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలలకు ఉభయదేవరులతో స్వామి దివ్యరథాన్ని అధిరోహించారు. మూడు గంటలపాటు రథోత్సవం సాగింది. గాలిగోపురం నుంచి దక్షిణాభిముఖంగా ప్రారంభమైన రథం మెయిన్‌బజార్ మిద్దె సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వరకు కదలింది. అక్కడ ఆంజనేయస్వామి, వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం తిరిగి రథోత్సవం గాలిగోపురం వద్దకు చేరుకుంది. స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు తిలకించి ముగ్ధులయ్యారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాఢభూషి వేదాంతచార్యులు వ్యవహరించారు. పద్మశాలీయ శ్రీ లక్ష్మీనృసింహస్వామి రథచప్పాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈవో ఎ.రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి రథాన్ని కొద్దిసేపు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లాగారు.

బంగారు గరుడోత్సవం

గురువార రాత్రి స్వామి కల్యాణోత్సవం అనంతరం స్వామికి బంగారు గరుడోత్సవం నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. గరుడోత్సవం శాశ్వత కల్యాణ కైంకర్యపరులుగా వాసిరెడ్డి సీతారామయ్య కుమారలు జయదత్తు, ప్రభునాథ్‌లు వ్యవహరించగా బ్రాహ్మణ సమారాధన శాశ్వత కైంకర్య పరులుగా అరిపిరాల చిన్నఅప్పయ్య శాస్త్రి, మొక్కపాటి ఆనందయ్యలు వ్యవహించారు.

నేడు వైభవంగా శ్రీనివాస కల్యాణం

- 2,700 మంది తిలకించేలా ఏర్పాట్లు
- భక్తుల రాక కోసం 300 బస్సులు
- టీటీడీ ఈవో జె శ్యామలరావు

తాడికొండ:వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. శుక్రవారం ఆలయంలోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ అధికారులు, జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 2,700 మంది భక్తులు కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లుచేసినట్లు వివరించారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా 300 బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కల్యాణోత్సవానికి ఆలయం ముస్తాబవుతోంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పుష్పాలకంరణ పనులు వేగంగా చేస్తున్నారు. దాదాపు 4 టన్నుల పూలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణ చేశారు.



అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న టీటీడీ ఈవో జెఓ శ్యామలరావు

భక్తజన సంద్రంగా శింగరకొండ

- భక్తులతో కిక్కిరిసిన దేవస్థాన పరిసరాలు
- సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా
- 650 మంది పోలీసులతో బందోబస్తు
- విద్యుత్ వెలుగుల్లో ప్రభలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరునాళ్లకు తరలివచ్చిన భక్త జన సందోహం

అద్దంకి: పుణ్యక్షేత్రమైన ప్రసన్నాంజనేయ స్వామి 70వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి శింగరకొండ భక్తజనసంద్రంగా మారింది. ప్రసన్నాంజనేయ స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ రాజగోపురాలు, పరిసరాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ సెట్టింగులతో క్షేత్రం మొత్తం దేదీప్యమానంగా వెలిగిపోయింది. విద్యుత్ ప్రభపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన, భక్తుల రద్దీతో క్షేత్ర పరిసరాలు ఇరుకుగా మారాయి.

650 మంది పోలీసు బలగాలతో పర్యవేక్షణ

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నలుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 46 మంది ఎస్సైలు, 587 పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్ల ఇన్‌చార్జిగా చీరాల డీఎస్పీ మెయిన్ వ్యవహరించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి, సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు, మేదరమెట్ల పైలాన్ వద్ద, రేణింగవరం జాతీయ రహదారి నుంచి అద్దంకి వైపు భారీ వాహనాలను దారి మళ్లించారు. 99అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ సమీపంలో 10పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.

వైభవంగా శింగరకొండ తిరునాళ్ల

అద్దంకి/అద్దంకి రూరల్: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, కొండపైనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామివార్ల 70వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీశైలం దేవస్థాన డిప్యూటీ కమిషనర్ రమణమ్మ ప్రత్యేకాధికారిగా, ఏసీ తిమ్మనాయుడు సిబ్బంది, ప్రత్యేక సిబ్బంది సహకారంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, ఉచిత దర్శనంతోపాటు, వీఐపీ, వికలాంగులకు, వృద్ధులకు, ప్రత్యేక దర్శన క్యూలైన్లతోపాటు, వివిధ ధరలతో కూడిన దర్శన క్యూలను ఏర్పాటుచేశారు. క్యూలైన్లలోని భక్తులకు మజ్జిగ, తాగునీరు, దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రత్యేక పూజలు..

ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళా భక్తులు స్వామివారికి చక్కెర పొంగలి వండి, కుండలను నెత్తిన పెట్టుకుని దర్శనంతో మొక్కులు తీర్చుకున్నారు. కొండ మీద శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఈవో కోటిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణం, సామూహిక వ్రతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు.



ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు



ప్రత్యేకాలంకరణలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి

వివిధ శాఖల ఆధ్వర్యంలో పర్యవేక్షణ

ఆలయ పరిసరాల్లో, విద్యుత్ శాఖ, మోదేపల్లి పీహెచ్‌సీ, పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఫైర్, మునిసిపల్‌తోపాటు, మండల పరిషత్, ఎల్ఐసీ, స్టేట్‌బ్యాంక్ వివిధ బ్యాంక్ బ్రాంచ్‌లు, స్వచ్ఛంద సేవా సంస్థలు వాసవి వనిత క్లబ్ ప్రకాశం ప్రభుత్వ హైస్కూల్1980–81 బ్యాంచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటుతో మజ్జిగ, తాగునీరు, పులిహోర పంపిణీ చేశారు.అన్ని సామాజిక సత్రాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం నిర్వహించారు.

ప్రత్యేక బస్సులు

అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. వీటితోపాటు జిల్లాలోని వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, దర్శి, పొదిలితోపాటు వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. కొండమీద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి వెంకటాపురానికి చెందిన పాకనాటి అంజిరెడ్డి, పాకనాటి మధుసూదన్‌రెడ్డికి చెందిన రెండు బస్సుల్లో భక్తులను ఉచితంగా చేరవేశారు.

అంగళ్లు ఏర్పాటు

క్షేత్రానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బొమ్మలు, చెరుకు విక్రయ, వివిధ వస్తువుల దుకాణాలు ఏర్పాటుచేశారు.

ప్రత్యేకాకర్షణగా ప్రభలు



తిరునాళ్లకు అద్దంకి, శింగరకొండపాలెంలకు చెందిన కమిటీల వారు ఐదు ప్రభలను ఏర్పాటుచేశారు. ఆ ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రథోత్సవం ప్రతి యేటా లాగానే దేవస్థాన ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామివారి ఉత్సవమూర్తులను రథంపై కూర్చుండబెట్టి మాడ వీధుల్లో ఊరేగించారు. రథోత్సవంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. దేవస్థాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేరళ నృత్యాలు, భజన కార్యక్రమాలు అలరించాయి.

క్లుప్తంగా

రేపు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



బాపట్ల: అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం బాపట్లలో జరుగుతుందని పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లవరపు పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులతోపాటు కార్యవర్గ సభ్యులందరూ పాల్గొంటారని తెలిపారు. విద్యారంగంలో వస్తున్న మార్పులపై చర్చించటంతోపాటు ఏబీవీపీ భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

బీజేపీ నాయకుడిపై పలువురి దాడి


దాడిలో గాయపడిన సురేష్

రేపల్లె రూరల్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన నగరం మండలం బోర మాదిగపల్లిలో చోటుచేసుకుంది. బోరమాదిగపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నగరం మండల అధ్యక్షుడు జుజ్జువరపు సురేష్‌కు అదే గ్రామానికి చెందిన చందోలు వీరయ్యతో కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. వీరయ్య మరి కొంతమంది గురువారం రాత్రి గ్రామ సమీపంలో కాపుకాసి ఇంటికి వెళ్తున్న సురేష్‌పై దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు కేకలు వేయటంతో వీరయ్యతోపాటు దాడికి ఉపక్రమించిన వారు పారిపోయారు. సురేష్‌ను వైద్య చికిత్సల కోసం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరయ్యతోపాటు దాడికి పాల్పడిన వారు మంకీ క్యాప్ ధరించి ఉన్నారని బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్ఐ భార్గవ్ తెలిపారు. సురేష్‌పై దాడి సంఘటన తెలుసుకున్న బీజేపీ నాయకులు బేతపూడి వెంకటేశ్వరరావు, పిన్ని సాంబశివరావులు పరామర్శించి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పాతకక్షలతో ఓ వ్యక్తిపై దాడి

రేపల్లె రూరల్: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని జంగాలపాలెంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న కొమరాబత్తిని శ్యామ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన కనపర్తి నాగేంద్రబాబు గురువారం రాత్రి కత్తితో దాడికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నాగేంద్రబాబును అడ్డుకుని తీవ్రంగా గాయపడిన శ్యామ్‌కుమార్‌ను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

నాటు సారాతో కుటుంబాలు రోడ్డు పాలు

- నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరం
- బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

నిజాంపట్నం: నాటు సారా తాగటంతో జీవితాలు నాశనమవ్వటమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడిన సంఘటనలు అనేకం ఉన్నాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారాతో కలిగే దుష్పరిణామాలపై నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఆధ్వర్యాన మండలంలోని దిండి పంచాయతీ యేమినేనివారిపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాటు సారా వ్యతిరేక నినాదాలతో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. తామే కాకుండా తమ కుటుంబ సభ్యుల జీవితాలను సైతం పాడుచేయటం ఎంత వరకు సబబో తామే ఆలోచించాలని సూచించారు. అపరిశుభ్ర వాతావరణంలో అశాస్త్రీయంగా తయారు చేయటంతో నాటు సారాలో ఎక్కువ మోతాదులో విషపూరిత రసాయనాలు ఉంటాయని, దీన్ని తీసుకోవటంతో ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని, శరీరంలో అన్ని అవయవాలు దెబ్బతింటాయన్నారు. ఆర్థికంగా, సామాజికంగా గౌరవ మర్యాదలు కోల్పోయిన వారవతారన్నారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని, ఈ నేరానికి పాల్పడిన వారికి 8 సంవత్సరాల కఠిన శిక్షతోపాటు రూ.5లక్షలు జరిమానా విధిస్తారని తెలిపారు. నాటుసారా తయారు చేసేవారికి అవసరమైన ముడిసరుకులు అందించే వారికి, విక్రయించే వారికి కూడా శిక్షలు తప్పవని చెప్పారు. గ్రామంలో నాటుసారా తయారు కాకుండా ఉండేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎవరైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు గమనిస్తే తమకుగాని, 9490455599, 9440902477 నంబర్లకుగాని, 14405 టోల్‌ఫ్రీ నంబరుకుగాని సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరం సీఐ శ్రీరామ్‌ప్రసాద్, ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు ఎస్.రామారావు, పి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పారిశ్రామిక చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ఎంఎస్ఎంఈ ఏడీ డాక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి


మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్

బాపట్ల: నూతన పారిశ్రామిక విధానాలపై అవగాహన కలిగి ఉండి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను, సహకారాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అభివృద్ధిని సాధించవచ్చని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెఎల్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు, వాటిపై అవలంబించాల్సిన విధానాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలను స్థాపించేందుకు కావాల్సిన వనరులపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గురించి తెలుసుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించటం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఇండస్ట్రియల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు తక్కువ పెట్టుబడి వ్యయంతో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని నాణ్యతతో కూడిన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాలలో ఉంటే సబ్సిడీలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పి.వీరయ్య, బాపట్ల జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శత చండీ మహా యాగం


త్రిశక్తి దుర్గా పీఠంలో యాగ నిర్వహణ

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్టా బ్రహ్మ, దేవీ ఉపాసకులు, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీ హనుమత్ స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చండీ పారాయణం, శత చండీ హోమం, గురు వందనం, ప్రధాన దేవతా అర్చన, శత చండీ హోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్ర పుష్పం, అమ్మవార్లకు దశ విధ అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. బగలాముఖి, రాజశ్యామల, వారాహి హోమాలు, యోగిని మండప హోమాలు నిర్వహించారు.గణేష్ యువసేన, త్రిశక్తి దుర్గాపీఠం బ్రహ్మోత్సవ కమిటీ, త్రిశక్తి దుర్గాపీఠం మహిళా శక్తి బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 6న ప్రారంభమైన పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం శనివారంతో ముగియనుంది. ఆఖరి రోజు శనివారం సర్వతోభద్ర మండల హోమాలు, ప్రాయశ్చిత హోమాలు, శాంతి హోమాలు, మహా పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం, ప్రోక్షణ, వేదఆశీర్వచనం, పండితుల సత్కారాలు, అన్నదానం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు హాజరుకానున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

నేడు మహిళ, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక

జె.పంగులూరు: మండలంలోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యాన జాతీయ స్త్రీ, పురుషుల జట్టు ఎంపిక జరగనున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 100 మంది పురుషులు, 100 స్త్రీలు వరకు పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో కోచ్‌లు, మేనేజర్లు, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొని మంచి ప్రతిభా వంతులైన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరిలో జరిగే 57 వ సీనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య పాల్గొంటారని తెలిపారు. ఎంపిక ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పంగులూరు గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతామరామిరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 28 వరకు ఖోఖో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో సాప్ అబ్జర్వర్, జిల్లా కార్యదర్శి బి కాశీవిశ్వనాథరెడ్డి, అధ్యక్షులు కుర్ర భాస్కరరావు, ట్రెజరర్ కె హనుమంతరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టెక్నికల్ ఆఫీసర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొంటారని సీతారామిరెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



తాడికొండ: తాడికొండ మండలం నిడుముక్కలలో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 16 రేషన్ బియ్యం మూటలను గురువారం అర్ధరాత్రి పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిడుముక్కల దర్గాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ మూటలను పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూటలను రేషన్ షాప్ నంబర్ 12కు అప్పగించినట్లు రెవెన్యూ ఆర్ఐ హనుమంతరావు వెల్లడించారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి

ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి కాజీం


ప్రసంగిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీం

ఏఎన్‌యూ: అట్టడుగు వర్గాల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.కాశీం అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ బాబూ జగ్జీవన్‌రామ్ ఇన్ నేషన్ బిల్డింగ్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభలో ఆచార్య కాశీం కీలకోపన్యాసం చేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ లక్ష్యం ఒక్కటేనన్నారు. ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.కోటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళా వందనం, విశ్రాంత ఐఆర్‌టీఎస్ అధికారి ఎ.భరత్‌భూషణ్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆలోచనా విధానాలను వివరించారు. వీసీ ఆచార్య కె గంగాధరరావు అధ్యక్షోపన్యాసం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, కావలి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ కళాశాల కామర్స్ విభాగాధిపతి ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ నివేదిక సమర్పించారు. అనంతరం సదస్సు పరిశోధనా పత్రాల సావనీర్‌ను, బాబూ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్ ఆనందబాబు రాసిన కర్మయోగి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

మాణిక్యవేల్‌కు నివాళి



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత డాక్టర్ అరుణాచలం మాణిక్యవేల్ (77) అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. అరండల్‌పేట 10/2వ అడ్డరోడ్డులోని ఆయన నివాస గృహంలో సందర్శకుల సందర్శనార్థం ఉంచారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు షేక్.నూరిఫాతిమా, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి (పశ్చిమ), నసీర్‌అహ్మద్ (తూర్పు), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరొందిన ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాణిక్యవేల్ అంత్యక్రియలు కొరిటిపాడులోని శ్మశానవాటికలో జరిగాయి. కుటుంబ సభ్యులు, ట్రిపుల్ ఎక్స్ సోప్ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

రైతులను భాగస్వాములను చేయాలి

రైతు సాధికారిత సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్


శిక్షణలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికలో రైతులను భాగస్వాములను చేయాలని రైతు సాధికారిత సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వార్షిక కార్యచరణ ప్రణాళికపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి జూమ్ కాల్ ద్వారా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ రసాయన వ్యవసాయం వల్ల పర్యావరణానికి తీవ్రంగా నష్టం కలుగుతుందని తెలిపారు. వాతావరణం కూడా అత్యవసరస్థితిని ఎదుర్కొంటుందని చెప్పారు. ఖరీఫ్ వార్షిక ప్రణాళిక, సార్వత్రిక సూత్రాలు, పలు జిల్లాల్లో వ్యవసాయ విధానాలు, రైతులు పండిస్తున్న ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్‌లో పండిస్తున్న పంటలు, రైతుల విజయ గాథలను వివరించారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ వ్యవసాయ, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ, సెరీకల్చర్, హార్టికల్చర్ తదితర శాఖల సమన్వయంతో కలిసి ప్రణాళికలను తయారు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నవధాన్యాలు సాగు భూమికి ఎంత మేలు చేస్తాయో వివరించారు. రైతులంతా పీఎండీఎస్ పద్ధతిని అవలంబించి సాగు చేయాలని సూచించారు. 30 రకాల విత్తన పద్ధతిని పాటిస్తే భూములు సారవంతమవుతాయని తెలిపారు. భూమి సంవత్సరమంతా పచ్చగా ఉంటే జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతమై, చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, రాష్ట్ర శిక్షకురాలు శాంతి, జిల్లా శిక్షకుడు సైదయ్య, ఎన్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, సౌజన్య, మేరి, స్వాతి పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

మార్టూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని బబ్బేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ముస్లిం కాలనీకి చెందిన షేక్ జాగర్లమూడి వలి కుమార్తె సబియా (27)ను ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన షేక్ సద్దాంతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఏడు, ఎనిమిది సంవత్సరాల ఆడపిల్లలు సంతానం. ఏడాది కాలంగా భర్తతో విభేదాలు తలెత్తడంతో సబియా భర్త, పిల్లల్ని వదిలి బబ్బేపల్లి గ్రామంలోని పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఇటీవల పిల్లలను తరచూ గుర్తుచేసుకుంటూ సబియా ఎవరితో కలవకుండా బాధపడుతోంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సబియా తమ ఇంట్లో ని రేకుల షెడ్డుకు గల ఇనుప రాడ్డుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం సబియా ఎంతకూ తలుపు తీయకపోవడంతో అనుమానంతో తల్లి నూర్జహాన్ స్థానికుల సాయంతో తలుపులు తెరిచి చూడగా ఆత్మహత్య విషయం వెలుగు చూసింది. అప్పటికే మృతి చెందిన సబియా మృతదేహాన్ని స్థానికులు కిందకు దించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శుక్రవారం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గొలుసు లాక్కొని యువకుల పరారీ

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కొని వెళ్లిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డు సీబీఐటీ స్కూల్ సమీపంలో నలిశెట్టి సులోచన నడిచి వెళ్తుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కొని పరారీ అయ్యారు. ఆమె కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు వెంబడించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం-చర్లపల్లి ప్రత్యేక రైలు (08579) ఈ నెల 16న సాయంత్రం 6.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (08580) ఈ నెల 17న ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, అదే రోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. రెండు మార్గాలలో ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడకుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లలో ఆగుతుంది.

ఉత్కంఠ మిన్నంటెన్

- పదో తరగతి పరీక్షలకు సర్వంసిద్ధం
- చదువులో తలమునకలైన విద్యార్థులు
- సంసిద్ధంలో ఉపాధ్యాయులు నిమగ్నం
- తల్లిదండ్రుల్లోనూ ఉద్విగ్నం
- 17 నుంచి పరీక్షలు ప్రారంభం
- పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వం మార్గదర్శకాలు


గుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి చదువు కీలక దశకు చేరింది. సోమవారం పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విద్యార్థులు చదువులో తలమునకలై ఉండగా, వారిని సంసిద్ధం చేయడంలో ఉపాధ్యాయులు నిమగ్నమై ఉన్నారు. బిడ్డల చదువులపై తల్లిదండ్రులూ ఉద్విగ్నక్షణాలు అనుభవిస్తున్నారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు టెన్త్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 30,410 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. వీరికోసం 150 కేంద్రాలను విద్యాశాఖ సిద్ధం చేసింది. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.

- హాల్‌టికెట్లు పొందిన విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలను సందర్శించి రోజూ పరీక్షకు ఎలా వెళ్లాలి.. ఎంత సమయం ముందు ఇంటి నుంచి బయలుదేరాలనే అంశాలపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రోజు ఉదయం 8.30 గంటల కల్లా కచ్చితంగా పరీక్షా కేంద్రాల వద్ద ఉండేలా చూసుకోవాలి.
- ఉదయం 8.45 నుంచి 9.30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 9.30 తరువాత పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని గుర్తుంచుకోవాలి.
- హాల్ టికెట్లపై ముద్రించిన తమ వివరాలు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి, సరి చేయించుకోవాలి.
- హాల్ టికెట్‌పై ఉన్న ఎన్‌రోల్ నంబరు ఆధారంగా కేటాయించిన గదులకు చేరుకోవాలి.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ఉంటుంది. అది ఉందో లేదో చూసుకోవాలి.
- పరీక్ష గదిలోకి ప్రవేశించగానే బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్నపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారు. ఇన్విజిలేటర్ సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఓఎంఆర్ షీట్ పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు గీయరాదు, వ్యర్థ రాతలు రాయరాదు.
- ఓఎంఆర్ షీట్‌పై విద్యార్థి పేరు, రాయబోవు పరీక్షకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ నిర్ధారించుకోవాలి.
- 9.30 గంటలకు పరీక్ష ప్రారమవుతుంది. మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగుస్తుంది. ఈ మధ్య సమయంలో విద్యార్థులను బయటకు అనుమతించరు.
- గుర్తింపు కార్డు కలిగిన పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బృందాలనే పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు.
- పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుశాఖ 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు విస్తృత రీతిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది.
- ప్రశ్నపత్రం లీక్ అయిందని, పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందని కొందరు పనిగట్టుకుని చేసే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకుండా, విద్యార్థులు పరీక్షలకు ప్రశాంతంగా హాజరు కావాలి. ఒక వేళ ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్నపత్రం లీకేజీకి గురైతే, అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబులో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు. జాగ్రత్తగా ఉండాలి.
- ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్‌ప్రాక్టీసుగా పరిగణిస్తారు. జాగ్రత్తగా ఉండాలి.

విస్తృత ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశాం. భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉంటాయి. విద్యార్థులను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలి. పరీక్ష కేంద్రాలకు వెళ్లి, వచ్చేందుకు ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్ చూపించి, ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

– సీవీ రేణుక, డీఈవో, గుంటూరు